కార్తీక మాసానికి ముస్తాబు



రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆకాశ దీపోత్సవం



మూలస్థానేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని శైవ క్షేత్రాలు కార్తీక మాస వేడుకలకు ముస్తాబయ్యాయి. పవిత్ర కార్తీక మాసం మంగళవారం నుంచి ఆరంభం కానుండడంతో మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, వహబ్‌పేటలోని ఉమామహేశ్వరస్వామి, తదితర దేవస్థానాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్తీక దీపాలు వెలిగించేందుకు తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో పార్వతీపరమేశ్వరుల దర్శనంతో సకలశుభాలు కలగాలని సోమవారం అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలకు తరలివచ్చి ఆకాశ దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

నగరంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామి సన్నిధిలో ఆకాశ దీపోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు మల్లు రామమోహన్‌రెడ్డి, గూడంశెట్టి దొరబాబు, నీళ్ల పెంచలమ్మ, ఎస్ విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనలక్ష్మీకుబేరపూజ



విశేషాలంకారంలో స్వర్ణమహాలక్ష్మి అమ్మవారు

నెల్లూరు(బృందావనం): దీపావళి సందర్భంగా సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో ఆది, సోమవారాల్లో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.దీపావళి అమావాస్య సందర్భంగా సోమవారం ధనలక్ష్మీ కుబేరపూజ జరిపారు. దీపావళి అలంకారంలో స్వర్ణమహాలక్ష్మి అమ్మవారు భక్తులను కటాక్షించారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, సభ్యులు పర్యవేక్షించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు (క్రైమ్): అనారోగ్యమో? మరే ఇతర కారణమో తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం ఆత్మకూరు బస్టాండ్‌లో చోటు చేసుకుంది. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లు కలిగి ఉండి, తెలుపు, నీలం నిలువుగీతల చొక్కా, నీలంరంగు షాట్ ధరించి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు నవాబుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 96306, 94407 96310 నంబర్లలో తెలియజేయాలని స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎం బాబి కోరారు.

వార్డెన్‌పై దాడి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని దేవరపాళెంలోని నారాయణ ఐఐటి కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై పలువురు సిబ్బంది భౌతిక దాడులకు పాల్పడిన విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది.వివరాలు.. రాపూరు మండలం పెనుబర్తికి చెందిన సన్నిబోయిన హరిబాబు గత రెండేళ్లుగా ఐఐటి కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న విద్యార్థులతో హరిబాబు చనువుగా ఉండడం గమనించి కళాశాల ఏఓ మందలించి దాడికి పాల్పడినట్లుగా వార్డెన్ తండ్రి సన్నిబోయిన వెంకటనరసయ్య నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే అతని ప్రవర్తన సక్రమంగా లేదనే కారణంగా కళాశాల నుంచి పంపివేశామని కళాశాల ఏఓ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులపై రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మైనార్టీ నేతపై దాడి

నెల్లూరు రూరల్: వ్యాపార లావాదేవీల నేపథ్యంలో మైనార్టీ నేత, మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ మున్వర్‌పై సోమవారం రాత్రి దాడి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని జెండావీధికి చెందిన మున్వర్‌బాషా గతంలో టీడీపీలో ఉండగా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు. గుండ్లపాళెం సమీపంలోని కిషోర్‌రెడ్డికి చెందిన ఆక్వా అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో వ్యాపార లావాదేవీల విషయమై వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మున్వర్‌బాషాపై కిషోర్‌రెడ్డి దాడి చేసినట్లు సమాచారం. గాయపడిన మున్వర్‌బాషాను తొలుత జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయంపై రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

కరువును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

నెల్లూరు సిటీ: టీడీపీ పాలనలో కరువును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలో 474 మండలాలు కరువును ఎదుర్కొంటుంటే కేవలం 103 మండలాలు మాత్రమే ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పెనుబల్లికి చెందిన షేక్ ఖాజావలి అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. జీవితంపై విరక్తి చెందిన ఖాజావలి (49) శనివారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి



పొదలకూరురోడ్డులోని నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి క్రాకర్స్ వెలిగిస్తున్న మంత్రి కాకాణి



నగరంలో బాణసంచా కాల్చుతున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): దీపావళి పర్వదినాన్ని నగర ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సంప్రదాయంగా ఆలయాలు, గృహాల్లో లక్ష్మీదేవికి విశేషపూజలు నిర్వహించారు. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా చీకటిని పారదోలుతూ దీపాలను వెలిగించారు. దీపకాంతులతో ఆలయాలు, గృహాలు దీపావళి శోభను సంతరించుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటిల్లిపాది పర్యావరణహిత టపాసులు పేల్చి సందడి చేశారు. పిండి వంటలను ఆరగించి ఆహ్లాదంగా గడిపారు.

ఆటో బోల్తా

కొడవలూరు : ఆటో బోల్తా పడి ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గండవరం సబ్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. బోగోలు నుంచి ప్రయాణికులతో నెల్లూరు వెళ్తున్న ఆటో ముందు వెళ్తున్న మరో ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బోగోలు మండలం బృందావనం వీధికి చెందిన తంబికన్నన్ సుందర్‌రాజన్(68)కు ఎడమ కాలు మడిమ వద్ద తెగిపోయింది. హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్సై కబీర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరస్వామివ్రతం



నెల్లూరు(బృందావనం): దీపావళి సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కేదారేశ్వరస్వామి వ్రతాన్ని ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

వేదగిరిపై విశేష పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతినక్షత్రం సందర్భంగా ఆదివారం విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావడసేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

15,16న మెగా ఇంపాక్ట్



నెల్లూరు(మినీబైపాస్): మాస్టర్ మైండ్స్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో ఈ నెల 15,16 తేదీల్లో మెగా ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపల్ బీ చైతన్యకుమార్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంపాక్ట్ కార్యక్రమంలో భాగంగా యువతకు మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖులైన 20 మంది మోటివేటర్స్ హాజరుకానున్నారని చెప్పారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రూరల్ డీఎస్పీ ఆంజనేయరెడ్డి, ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు, మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంపాక్ట్ ఇన్‌చార్జి మల్లికార్జున్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డీ సునీల్, సైకాలజిస్ట్ సింగంశెట్టి అభిషేక్ పాల్గొన్నారు.

మంత్రి కాకాణిని కలిసిన న్యాయవాదులు



మంత్రి కాకాణికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు పీ ఉమామహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ సిద్దన సుబ్బారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతి మధ్యంతర పిటిషన్‌పై రూ.20 వెల్ఫేర్ స్టాంపు నిబంధనను తొలగించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో వంశీధర్‌రెడ్డి, మాల్యాద్రి, కేవీ శేషారెడ్డి, ప్రకాష్ తదితరులు ఉన్నారు. అలాగే మంత్రి కాకాణిని జిల్లా వైఎస్సార్సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా రూ.20 వెల్ఫేర్ స్టాంపు డ్యూటీని విధించడం ద్వారా న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు జీవీ నరసయ్య, శ్రీనివాసులు, నారాయణ, శ్రీహర్ష, కోటేశ్వరరావు, షకీం తదితరులు ఉన్నారు.

ఏపీడబ్ల్యూజే నేతల వినతి

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మస్తాన్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ రూపొందించిన ముసాయిదా జీఓలో మార్పులు చేయాలని వినతిపత్రం అందజేశారు. కొత్తగా విడుదల చేసిన జీఓతో వేలాది మంది జర్నలిస్టులు నష్టపోతారని వివరించారు. జర్నలిస్టులకు మేలు చేకూరేలా జీఓలో సవరణలు చేసేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి కాకాణి జర్నలిస్టులకు సౌలభ్యంగా ఉండేలా జీఓ సవరణ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షులు దయాశంకర్, నాగరాజు పట్టపల్లి, కోశాధికారి హనూక్, నరేంద్ర తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన డిప్యూటీ మేయర్

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 16న నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రపై చర్చించారు.

నిరుపేద చిన్నారుల నడుమ దీపావళి వేడుకలు



నెల్లూరు(బారకాసు): శ్రీగణేష్ సేవా మిత్ర మండలి(జీఎస్ఎం) ఆధ్వర్యంలో నగరంలోని డంపింగ్ యార్డులో ఉంటున్న నిరుపేద కుటుంబాల చిన్నారుల మధ్య దీపావళి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎస్ఎం చైర్మన్ గాలి శ్రీధర్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా దీపావళిని పేద పిల్లల మధ్యన నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు అన్నదానంతో పాటు స్వీట్‌బాక్సులు, నూతన వస్త్రాలు, టపాకాయలు పంపిణీ చేసి వారి మోహంలో చిరునవ్వును చిందించామన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో రాజేష సందీప్‌రెడ్డి, అభిలాష్, సుప్రజ, శ్రీనివాస్, శశాంక్‌సాయి, అనిల్, అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

సీఐ రామారావు హఠాన్మరణం



జి.రామారావు(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామారావు(55) గుండెపోటుతో మరణించారు. వివరాలు.. ఆదివారం యథావిధిగా విధులకు హాజరైన సీఐ జి.రామారావుకు ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో సిబ్బంది హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలియజేశారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మృతదేహాన్ని సీఐ స్వస్థలం గుంటూరులోని పున్నూరు దగ్గర మన్నావ గ్రామానికి తరలించారు.

ఎమ్మెల్యే పరామర్శ

సీఐ మృతి విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాస్పిటల్ వద్దకు వెళ్లి రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని తెలియజేశారు.

కొడవలూరు : బుచ్చిరెడ్డిపాళెం సీఐ జి.రామారావు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరితో స్నేహ పూర్వకంగా ఉంటూ వృత్తికే వన్నె తెచ్చిన ఆయన హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్తీక మాసానికి కళాత్మక ఆహ్వానం



మిరియాలు, ధనియాలతో తీర్చిదిద్దిన శివలింగం



ప్రమిదలతో తీర్చిదిద్దిన శివలింగం

నెల్లూరు(బృందావనం): హరిహరాదులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీక మాసం మంగళవారం ప్రారంభం కానుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన వృత్తినైపుణ్యంతో ప్రమిదలు, మిరియాలు, ధనియాలతో పరమేశ్వరరూపాన్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 170 ప్రమిదలతో మూడు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో శివలింగాన్ని, 50గ్రాములు మిరియాలు, 25గ్రాములు ధనియాలతో 6అంగుళాల ఎత్తు, 4 అంగుళాల వెడల్పుతో ముక్కంటి రూపాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



వస్త్ర సంచులను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): పర్యవరణ పరిరక్షణకు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా భారత్ సేవా ఫౌండేషన్ తయారు చేసిన వస్త్ర, జూట్ సంచులను మంత్రి కాకాణి నగరంలోని తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కవర్లకు బదులుగా వస్త్ర సంచులను వినియోగించాలని కోరారు. అనంతరం భారత్ సేవాఫౌండేషన్ అధ్యక్షుడు కే రాజశిఖామణి, సెక్రటరీ షేక్ ఖాసీం, జాయింట్ సెక్రటరీ రత్నయ్య, ట్రెజరర్ టీవీ సుబ్బారెడ్డి, ఆర్గనైజర్ కొమ్మల కృష్ణయ్య, సబ్‌ఆర్గనైజర్ కిన్నెర వెంకటేశ్వర్లును అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కుసుమకుమారి, చేతిసంచుల వితరణ దాత, ఉపాధ్యాయుడు బద్దెపూడి శీనయ్య, భారత్ సేవా ఫౌండేషన్ సభ్యులు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నాటక, కళా రంగాలను ప్రోత్సహించాలి



కళాకారులను సన్మానిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): నాటక, కళా రంగాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి కోరారు. ఇటీవల శ్రీకాకుళం రంగ స్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సాంఘిక నాటక పోటీల్లో నెల్లూరుకు చెందిన శ్రీక్రాంతి ఆర్ట్ థియేటర్స్ బృందం ఆధ్వర్యంలో ప్రదర్శితమైన 'ఓ మనిషి కావాలి' నాటకం పలు అవార్డులను అందుకుంది. ఈ సందర్భంగా గాంధీబొమ్మ సమీపంలోని 25 కళాసంఘాల కార్యాలయంలో నాటక ప్రదర్శనలో పాల్గొని అవార్డులు అందుకున్న కళాకారులు చిల్లర సుబ్బారావు, తంబు సురేష్‌బాబు, బొమ్మలాట పార్వతీశం,నియాజ్‌బాషా, మహబూబ్‌బాషా, నరేంద్ర, చైతన్య, తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడారు. నాటకరంగానికి నెల్లూరు ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రభుత్వం నాటకరంగాన్ని ప్రోత్సహిస్తే ప్రతిభగల కళాకారులు ఎందరో వెలుగులోకి వచ్చి సింహపురి ఖ్యాతిని దశదిశలా చాటుతారన్నారు. ఈ కార్యక్రమంలో 25 కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, డాక్టర్ షేక్ అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, దొడ్డాక సుబ్రహ్మణ్యం, డ్యాన్స్‌మాస్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.